# నీటి దీపాలు

ముప్పదేళ్ళక్రితం చూచిన ఆ వూరును గుర్తుపట్టగలిగాను కాని చాల మందిని గుర్తించడం మాత్రం అంత సులభంగా కనిపించలేదు. ఆ బంధుత్వం కలిపిరాకుంటే ఆ వూరికి వెళ్ళడం పడేది గాదు. ఎటూ వెడుతున్నాము కనుక కాస్త పొద్దుండగానే వెళ్ళి పాతమిత్రుల్ని ఒక్క-రిద్దరిని పలకరించి వద్దామనుకొన్నాను.

పెళ్ళి జరిగే యింటిముందు పెద్దపందిరే వేశారు. వీధివైపు చిన్న మేడకూడా కట్టారు. పందిరి అలంకరణలో నిమగ్నులైన చిన్నపండయ్య నన్ను కూచోమని అప్పటికప్పుడే కాఫీ తెప్పించాడు. "అంతా ఐపోవచ్చింది. ఎలక్ట్రిక్ బల్బులు, ట్యూబులు, అన్నీ కట్టేస్తున్నారు. పూల జోడింపోళ్ళువస్తే మనపని తీరినట్టే" అన్నాడు.

చినపండు ముగ్గురు కూతుళ్ళకూ పెండ్లిండ్లయిపోయాయి. ఇపుడు జరుగుతున్నది కడగొట్టుబిడ్డ విశాలాక్షికి. కాస్త దగ్గర కలిసినవారైనా ఆ మూడు పెండ్లిండ్లకూ నేను వెళ్ళలేకపోయాను. చినపండయ్య పత్రికయిస్తూ "బంధువులంటే యింత నిర్లక్ష్యం పనికిరాదయ్యా" అని అనడంతో నాకూ హృదయం చివుక్కు-మన్నది. వచ్చిన చిక్కల్లా రిక్తహస్తాలతో ఎలా వెళ్ళడమనే గాని పోగూడదనే నిర్లక్ష్యం ఎలా ఉంటుంది? పైగా పెళ్ళికొడుకు పక్షంకూడా కలిసినవారైరి.

ముప్పదేళ్ళ నాటికీ ఈనాటికీ ఎంతో తేడా కన్పించింది వూరు.

ఆనాడు వూళ్లో గుడీ లేదు. బడీ లేదు. ఈనాడు రెండింటితోపాటు ఒక కమ్యూనిటీ హాలు కూడా ఉంది. చినపందు దగ్గర నుండి ఇంకా కొన్ని విశేషాలుకూడా విన్నాను. ఆగ్రామానికి కరెంటు వచ్చి నాలుగేండ్లయిందట. అప్పటినుండి సేద్యంలో చాలాశ్రమ తగ్గిందన్నాడు. వూళ్లో ప్రతి యింటికీ కాకపోయినా చాల యిండ్లకు కరెంటు దీపాలు రావాలన్నాడు. ఆ మాటా ఈమాటా మాట్లాడుతూ ఈరాత్రికి వూళ్ళో వీధినాటకం కూడా ఉందన్నాడు.

ఏ సినిమానైనా చూడ్డం సులభంకానీ వీధినాటకాలు చూచే ఛాన్సు మాత్రం దొరకదు. అట్లా అవకాశం వస్తే చాలు ఐదారు మైళ్ళయినా నడచి వెళ్ళడం నాకలవాటు. కమ్యూనిటీ హాలు ముందు చిన్న పందిరి వేసి రెండు బెంచీలు కూడావేశారు. 'పందిరి స్తంభాలకు రెండు ట్యూబులైట్లు కట్టారు. ఈ రాత్రికి కాలక్షేపం బాగానే ఉంటుందనుకొన్నాను. ఇంకా బారెడు పొద్దున్నందువల్లా అలా పొలాల వెంబడి నడచివద్దామని బయలుదేరాము.

" వూరిచుట్టూ బావులకు కరెంటు మోటార్లున్నాయి. వూళ్లో మాత్రం ఇళ్ళకింకా కరెంటు ఇవ్వలేదు " అన్నాడు వెంకటరత్నం. వెంకటరత్నం నాతోపాటు ఆరు మాసాలు రామాపురంలో టీచరుగా పనిచేశాడు. రిటైరై ఆ వూళ్లోనే కాపురం ఉన్నాడు. ఇంకో ఏడాదైనా ఎక్స్టెన్సన్ యివ్వలేదని అతని ఆవేదన. ఆయన చినపందయ్య మేనల్లుడు కావడంవల్లా ఉదయమే వచ్చినట్లున్నాడు.

వూరి పొలిమేర దాటుకొంటుండగా పెండ్లికొడుకు వాళ్ళ పార్టీ కనిపించారు. ఒక బస్సు నిండుకూవచ్చిదిగారు. పొద్దుగూకితే గాని వూళ్లో అడుగు పెట్టకూడదు. అంచేత ఆ చింతచెట్టుకింద చలవబండల మీద సూట్ కేసులన్నీ ఉంచి ఆ చుట్టూ కూచుంటున్నారు. ఆవచ్చిన వారిలో

ఐదారుమంది గుర్తుపట్టి నాచుట్టూమూగారు. వారితో పిచ్చాపాటి మాట్లాడుతూ ఉండగానే కనుచీకటి పడింది.

మపిబాణం ముగింపిందే భోజనాలన్నారు. ఆవెనుకనే సాంగ్యా లన్నారు అందరూ కలిసి బంతిచాపలపై కూచున్నాము. అదే పందిరిలో ఉత్తరపు కొసలో రెండు గజాలకవతల ఒక కుర్చీబల్ల వేశారు. ఆ కుర్చీలో కూర్చున్న కొత్తవ్యక్తివైపు నా దృష్టి పడింది. అతని వయస్సు యించు మించు పాతికేళ్ళు కావచ్చు. ట్యూబ్ పాంటు పెర్లిన్‌స్లాక్ వుంగరాలజుత్తు. పెద్ద రిస్టువాచి కట్టుకొన్నాడు. ఐదారుమంది ఆయనకు అతివినయంగా వడ్డిం చడం మొదలు పెట్టారు. చినపండు అతని వద్దనే నిలబడ్డాడు. ప్రత్యేకమైన శ్రద్ధతో ప్రతి నిమిషం ప్రతి పదార్థాన్నీ మరికొంత వేయించడానికి ప్రయ త్నిస్తున్నాడు. ఆ దృశ్యాన్ని గమనిస్తున్న నా ఆకులో ఏముందో నాకు తెలి యకనేపోయింది. ఆ యువకునికి మాత్రం గ్లాసులో పాయసం గడ్డ పెరుగు డబుల్ స్వీట్స్ వడ్డించడం గమనించాను. ఆశ్చర్యమేమంటే అతడు చెయ్యి కడుక్కోవడానికి కూడా ఒక బక్కెట్ తెచ్చిపెట్టారు. భోజనాలైనాక అత డెవరో తెలుసుకొందా మనిపించింది. కానీ మనకేంవచ్చిందనే నిర్లిప్తతతో వూరుకొన్నాను.

వీధి పంచలో ఒక పెద్ద మంచంవేశారు. ఆ మంచం మీద పరుపు తలగడ కూడా కన్పించాయి. ఎవరికి వేసి ఉంటారని వూహించడానికి నా కట్టే కాలం పట్టలేదు. ఆ టేబుల్ మీల్స్ తీసుకొన్న యువకుడే ఆ మం చంమీద వచ్చి కూచున్నాడు. ఆయనకు ప్రత్యేకంగా ఒక తట్టలో తాంబూ లం తెచ్చి పెట్టాడు చినపండయ్య. ఇంకో మనిషి సిగరెట్ పెట్టె అగ్గి పెట్టె తెచ్చి యిచ్చాడు. ఆ వూళ్లో అరుగులేని పంచలేక పోవడంవల్లా మేమంతా అతనిలా హాయిగా కాకపోయినా కొంత ఫ్రీగానే కూచున్నాము. ఈ లోగానే ఆరంభమయింది నాటకం.

హెచ్చరికతో నుండుడీ

సభికులారా

హెచ్చరికతో నుండుడీ

అదిగో వచ్చెను రాజు

ఇదిగో వచ్చెను సభకు

హెచ్చరికతో నుండుడీ

సభికులారా!

సభికులారా!

సోపుదారి సభలో ప్రవేశించి పాడుతూ నృత్యం ప్రారంభించాడు. శివమెక్కిన నృత్యంలో చివరిచరణం తారాస్థాయి నందుకొన్నది.

భీకు

లారా

భీకు

లారా

భీకు

లారా ....

ఇందు 'స' సైలెంటయిన సంగతిని గ్రహించడానికి నాకు ఐదారు నిమిషాలు పట్టింది. అప్పుడు నాటకరంగంలో నుండి ఒక పెద్దమనిషి మా ముందు మంచంపై శేషశయనుని భోజులో నన్న యువకుని వద్దకు వచ్చి "తెర వెనుక ఒక ట్యూబులైటు తగిలించుకొంటామండి తాము ...." అంటూ గునిశాడు. "సరే వెళ్ళవయ్యా" అన్నాడాయన.

అపుడు అర్థమయింది నాకు. బహుశా ఆ యువకుడా వూరి కామందు కొడుకై ఉంటాడు లేదా కనీసం ఆ వూరి సర్పంచైనా

ఐఉంటాడు. ఇద్దరూ కాకుంటే కొత్తగా చార్జి తీసుకొన్నమునసబైనా ఐ ఉంటాడు. ఈ ముగ్గురిలో ఏ ఒక్కడో ఐతేనేగానీ అంత గొప్ప మర్యాద జరగడానికి వీల్లేదని నాకు తెలుసు.

ఇంతలో కొలువు కూటానికి రాజువచ్చిన చప్పుడు వినిపించింది.

వచ్చే కోటి
సూర తేజో
హెచ్చైనా హరి
శ్చంద్రుడపుడు. ...

అవునవును. హరిశ్చంద్ర మహారాజే. కిరీటం ఉంది. మెడలో హారం కూడా. భుజకీర్తులు. ....

"సుఖమా
మన రాజ్యమెల్ల
మన రాజ్యమెల్ల
సుఖమా
వోరోరి మంత్రీ
వోరోరి మంత్రీ. ....

అంటున్నాడాయన. హానరబుల్ మినిస్టర్సును అంత పెద్దసభలో అట్లా సంభోధించడం ఈ డెమొక్రసీలో బ్రతుకుతున్న నా వంటి వానికి ఎంతో వెగటుగా కనిపించినా ఫీల్ కావడం తప్ప నా అసమ్మతిని తెలుపలేక పోయాను. అలా చూస్తుండగానే హరిశ్చంద్ర మహారాజు పబ్లిక్ ఎంక్వయరీ ప్రారంభించాడు.

" నెలకు మూడు
వానలు కురిసెనా

మన రాజ్యమెల్ల
నెలకు మూడు .... "

అంటూ ఆయన మరీ తీవ్రస్థాయిలో గద్దించి ప్రశ్నించాడిట్లా

" నెలకు మూడు
నెలకు మూడు "

ఆ వెనుక పాటలో

" వానలు కురిసెనా
వానలు కురిసెనా .... "

మూడు నెలలకు ఒక వాన కూడా లేని డెమాక్రసీలో మంత్రులను ఎవరూ ప్రశ్నించరు. ఆనాడు హరిశ్చంద్రుడంత గట్టిగా అడగడం వల్లనే రాజ్యాన్ని పోగొట్టుకొన్నాడనిపించింది. ఇన్నోసెంట్ కింగ్.

నాటకం మంచి రక్తిగడుతోంది. రాజు వేషం వేసిన వాడు కంచు గొంతుతో పాడుతున్నాడు. మృదంగం శబ్దం మస్తిష్కంలో ఆకస్మికంగా సంభవించిన భూకంపం వలె భయానకంగా వుంది. ఉన్నట్టుండి దీపాలారి పోయినవి.

నాకు ఎలెక్ట్రిక్ దీపాలంటే ఎంతో అభిమానం. అవి నీళ్ళదీపాలైనా భలే వెలుగు నిస్తాయి కానీ పెండ్లిండ్లలో మూడు ముళ్ళు పడేటప్పుడే ఆరిపోతాయి. ఆకలితో అన్నం ముందు కూచున్నపుడే కళ్ళు మూస్తాయి. ఏదో మంచి పద్యం మూడో పాదంలో మొదటి పంక్తి వ్రాస్తున్నపుడే గప్పుమంటాయి. ఈ నాటకంలో కూడా అంతే. రాజుగారు రావడం మంత్రి గారిని ప్రశ్నించడంతోనే ట్యూబ్ లైట్లు ఆరిపోయాయి

ఐదారుమంది మంచం వద్ద వచ్చినిలబడ్డారు. రెండు టార్చిలైట్లు తెచ్చారు. ఆ యువకుడు ముందుపోతుంటే వారు అనుసరించారు.

నేననుకొన్నాను. ఆయనకు కోపం వచ్చిందని. పెళ్ళి పందిరిలో దీపాల్లేవు. నాటకమూ ఆగిపోయింది. ఆ వూరి కామందుబిడ్డ వూరుకోడను కొన్నాను. అందుకే ఆయనట్లా చివాలున లేచిపోయాడనీ ఐదారు నిమిషాల్లో కాకపోయినా అరగంటలో కరెంటు రావచ్చుననీ నాటకం ఆగిపోదనీ నేను పూర్తిగా విశ్వసించాను. కానీ నాకొక అనుమానం వుంది. మా టవున్లో దీపాలారిపోతే రావడానికి రెండు మూడు రోజులుకూడా పడుతుంది. కరెంటు ఆఫీసులో పెద్ద పుస్తకం వుంది. అందులో వ్రాయాలి. ఆపని చేసిన వెనుక అందుకు సంబంధించిన వారితో మనవి చెయ్యాలి. వారు కన్పించడం చాల కష్టం. ఎప్పుడూ వారు లైను మీదే ఉంటారు. లైన్ మీదే వెళ్ళాడనడం వారు వాడే పదజాలం. ఈ గమ్మత్తయిన ప్రయోగం ఏ సాహితీ వేత్తలకూ అర్థంకాదు. సర్కస్‌లో ఏదో ఇనుపతీగ మీద నడిచే వారిని చూచిన మనకు విద్యుల్లతలమీద వెళ్ళేవారిని గురించి వూహించడం కూడా చేతకాదు.

నాటకరంగం నిశ్శబ్దంగావుంది. సభాంగణంలో రాజున్న సవ్వడికానీ మంత్రిగారున్న శబ్దంగానీ స్ఫురించ లేదు. అక్కడక్కడా చుట్టలూ, బీడీలు, సిగరెట్లు కాలుస్తున్న ప్రేక్షకుల కృపా కటాక్షముల వలన కాస్తకూస్తా వెలుతురు మాత్రం కన్పిస్తోంది.

ఉన్నట్టుండి కళ్ళు జిగేల్ మన్నవి. రంగ స్థలంపై హరిశ్చంద్రుడున్నాడు. మంత్రి చేతులు కట్టుకోవడం నాకేమాత్రం పట్టలేదు. రాజుల కాలంలో మంత్రులైనా అమాత్యుల కుండవలసిన ఠీవి అతనిలో ఏకోశానా లేదు. అపాయింటెడ్ మినిస్టర్సంతా అంతేమరి! ఎలెక్టెడ్ మినిస్టర్సయితే ఎలెక్ట్రిక్ బల్బుసలాగా వెలిగిపోతారు. స్విచ్ ఆన్ చేస్తే చాలు గ్రామ ఫోన్ ప్లేట్‌లాగా పలకాలి మరి!

రాణీ చంద్రమతి దేవిగారు సభకు వచ్చారు. లోహితాస్యుడింకా రాలేదు. ఇంకా ఎంతో వుంది నాటకం. విశ్వామిత్రుడు, నక్షత్రకుడు, మతంగ కన్యలు చూడాలనేవుంది. అర్ధరాత్రి కావస్తోంది. ఆవలింతలు కూడా!

ఆ యువకుడు మంచంమీద మళ్ళీ వచ్చి కూచున్నాడు. చినపండయ్య గ్లాసు నిండుకూ పాలు తెచ్చి పెట్టాడక్కడ. ఆయన పాలు త్రాగి సిగరెట్ ముట్టించాడు. ఇంతలో ఇంకో కొత్త సిగరెట్ పెట్టె తెచ్చి పెట్టారక్కడ.

పెండ్లి యింట్లో నలుగులు పెడుతున్నారని పిలుపు వచ్చింది. ఆడవాళ్ళకేగాక మగవాళ్ళకుకూడా అదో వేడుక. ఎవరో శతాధిక వృద్ధుడు పాడుతున్నాడు.

"నలుగిడా పిలిచేరు
నవమోహనాంగ
ఓ నవమోహనాంగ
వేగామే రావయ్య
వేణూగోపాల
నా వేణూగోపాల........
అత్తరూ పన్నీరూ
అమర్చిన గంధం
బాగా అమర్చిన గంధం
అలదు కొందువుగాని
లేచీరావయ్యా."

ఆ పాట విని స్వరం వాయిస్తున్నారు మేళగాళ్ళు. అక్కడ పెండ్లి. ఇక్కడ నాటకం. ఆ మధ్య ఆ మంచం మీద ఆశీనుడైన యువకుడు. ఆ గోలలోనే నాకు నిద్రపట్టింది. అంత గోలలోనూ నిద్రపోగలనని నాకు తెలియదు. నిద్రకు కొత్తచోటే ఐనా నాకు మాత్రం నిద్ర వచ్చింది. ఎన్ని

గంటలు నిద్రపోయానో ఎరుగను. కానీ నాకు మెలకువ వచ్చినపుడు చంద్ర మతి అడవుల్లో నడుస్తున్నది.

"నడచి నడచీ కాళ్ళు
తడబడుచున్నవి
గులకరాళ్ళ కనుమ ....
కాకులు దూరని కారడవి దాటితిమి
చీమలు దూరని చిట్టడివి దాటితిమి
అయ్యో!
నా కొడుకా లోహితాస్యా."

ఈ జనాల కెంత విశ్వాసం. సత్యానికి కట్టుబడిన హరిశ్చంద్రుని గాధ పట్ల ఎంత అభిమానం. నిజంగా కొందరు కళ్ళల్లో నీళ్ళు పెట్టు కొంటున్నారు. రోజూ అడవుల్లో కట్టెలు కొట్టి అమ్ముకునే పేదవాళ్ళు కూడా చంద్రమతి అడవుల్లో నడచిపోతున్నదని బాధపడుతున్నారు. నక్షత్రకుడు అప్పుయిచ్చి తీరాలని దబాయిస్తున్నాడు. అతణ్ణి చూస్తే మొన్న మా వూళ్ళో రైతుపడుచు దగ్గర బిందెను లాగి జప్తుచేసిన ఐ. ఏ. యస్. ఆఫీ సర్ గుర్తుకు వచ్చాడు. బాగా కళ్ళు పులుముకొని కూచున్నాను. మళ్లీ ఆరిపోయాయిపాడు దీపాలు. పైమెంతో తెలియదు. ఆ మంచం చుట్టూ పదిమంది పోగైనారు. ఆయన కస్సు బుస్సుమంటూ పైకి లేచాడు. టార్చ్ లైట్స్ తీసుకొని బయలుదేరారు.

నాకుమాత్రం కరెంటువారిపై పట్టరాని కోపం వచ్చింది ఆ మధ్య ఒక సాహిత్యసభలో కూడా అంతే జరిగింది. మా వూళ్ళో ఆధునిక రచ యిత ఆరిపోయిన దీపాలనే వచనగేయాల సంపుటి ఆవిష్కరణోత్సవం జరిపారు. మేమంతా ఎంతో శ్రమపడి ఇరవై ఏడు మందితో హాలును అలం

కరింప చేశాము. సమయానికి జిల్లా విద్యాశాఖాధికారి దొరకనందున విద్యుచ్ఛక్తి శాఖాధికారిచేత ఆవిష్కరణోత్సవం ఐయిందనిపించాము. ఆయనా మహద్గ్రంథానికి చుట్టివుంచిన రిబ్బనును విప్పుతుండగా అన్ని దీపాలు ఒక్కసారిగా ఆరిపోయాయి. ఈ విద్యుద్దీపాలన్నీ మాట్లాడు కొన్నట్లు ఒక్కసారిగా ఆరిపోతాయి. ఒకటీ రెండయినా మిగిలి వెలుగుతాయనే ఆశకూడా లేదాయె. ఐతే ఆ గ్రంథం "ఆరిపోయిన దీపాలు" కావడం వలన అలా జరగడం దైవీకృతమనీ, అది గ్రంథం యొక్క విలువను యినుమడింప చేస్తున్నదనీ సమర్థించి ఇరవై ఏడు మందిచేత పెద్దగా చప్పట్లు కొట్టించుకొని దీపాలు వెలుగక ముందే ఆవిష్కరణోత్సవాన్ని ముగించి అందరికీ కృతజ్ఞతలు సమర్పించుకొన్నారు.

కోపం నా కొక్కడికే అనుకొన్నాను. నా ప్రక్కనున్నాయన అన్నాడు గదా "ఈ కరంటోళ్ళతో మా ప్రాణం పోతున్నదండీ. మొన్న రాగిపైరు నాటడానికి ముప్ఫైమంది కూలోళ్ళను పెట్టాము. పదకొండు గంటలకు కరెంటు నిలిచిపోయింది. ఆ దినం కూలి కట్టిచ్చి మరునాడు మళ్ళీ నాటాము.

ముప్ఫైమంది కూలీలకు అన్నం పెట్టి అరవై రూపాయలు కూలీ యిచ్చి పని జరుగకనే పూరుకొన్న రైతు హరిశ్చంద్రుని కంటే మంచి వాడని పించింది.

"అంతే గాదండీ మొన్న మీటరు కాలిపోతే డబ్బు మా దగ్గర తీసుకొన్నారు." ఇంకో ఆయన నవిగాడు.

ఇంకా నాటకం చాలా ఉంది. ముహూర్తం మూడు—నాలుగున్నర గంటల మధ్య కావడంవలన పెళ్ళి పందిరిలో కూచోవడం మేలనిపించింది. పెళ్ళింటిలో కూడా చీకటి తాండవిస్తోంది. ముహూర్త కాలం సమీపించడం

వలన పౌరోహితుడు తొందరపడుతున్నారు. ఆ సన్నగా వెలిగే నూనె దీపాల వెలుగులోనే అన్నీ సర్దు కొంటున్నాడు.

కాలు కాలిన పిల్లిలా తిరుగుతున్న చినపండయ్యతో మెల్లగా అన్నాను. "ఒకటో రెండో పెట్రోమేక్స లైట్లు తెచ్చిఉంటే బావుండేది గదండీ."

ఆయన తల వూపుతో "ఏం చేద్దాం చెప్పండి అన్నిటికీ ముప్పై మూడుకూ నేనొక్కన్నేగా అన్నాడు. వెయ్యికండ్లతో చూస్తూ చే స్తేగానీ ఒక్క పెండ్లి చెయ్యడము కష్టం. ఆ పరిస్థితి కొంత జాలికరంగానే కన్పించింది. ఇంకో ఐదారు దీపాలను వెలిగించమని ఆ పందిరిలోనే కూచున్నాను.

లగ్నం సమీపిస్తున్నందున అందరూ వచ్చి కూచున్నారు. విద్యుద్దీపాలు వెలగక పోయినా ముహూర్తం ఆగలేదు. బొట్టుకట్టి ముగిసిందే చదివింపులు ఆరంభించారు.

ఆ నాటకం ఏమైపోయిందో చూదామని వీధిలోకి వచ్చాను. అది కూడా ఆగలేదు. దివిటీల వెలుగులో వల్లకాటిసీను ఐపోయింది. లోహితాస్యుడు బ్రతికిపోయాడు. తిన్నెమీద కూచోగానే లైట్లు జిగేల్‌మన్నాయి. ఆ మంచం మీద యువకుడు కనిపించలేదు. ఆయన అప్పుడు వెళ్ళాడు. గదా! ఏమైనాడు ?

"ఏవరండీ ఆ మంచపై నుండిన మనిషి" ప్రశ్నించాను అప్పుడే నా ప్రక్కన వచ్చి కూచున్న వెంకటరత్నాన్ని.

"ఆయనా! కరెంటాయన ఈ వూరి లైన్‌మేన్ గదండీ.

లైన్‌మేన్.

కరెంటాయన. కనుకనే ఆయన చీఫ్‌గెస్ట్.

"ఈ లైట్లు ?"

నా ప్రశ్నకు ముందే వెంకటరత్నం సమాధానం చెప్పాడు. "ఇదంతా డైరెక్ట్ కనెక్షన్. లైన్‌మేన్ చేతిలో ఉంటే చాలు. ఈ వూళ్లో ఏ పెళ్ళి జరిగినా యింతే. ఉత్సవాలకు వూరేగింపులకు ఏ పోలుకో తీగెను తగిలిస్తాడంతే.

నాకేమీ తోచలేదు. సమాజంలో ఎవరు దొంగలో అర్థంకాలేదు.

" లైన్‌మేన్ మాత్రం ఏం చేస్తాడండీ పాపం! కనెక్ష నివ్వకుంటే ఒళ్ళు కాపడం పెడతారు. వూరిని చెడ్డచేసుకుంటే ఉద్యోగం చేసేదెట్లా? మళ్ళీ అన్నాడు వెంకటరత్నం.

ఆ మరునాడు పత్రికలో మొదటి పేజీలోనే ఉందొక శీర్షిక.
" ఎలక్ట్రిసిటీ రేట్ల హెచ్చింపు! "

" విద్యుచ్ఛక్తి శాఖామాత్యుల ప్రకటన "

ప్రజలు ప్రతినిధులు, ఉద్యోగులు, అమాత్యులు అందరూ మంచి వారే. అలా ఒప్పుకోవాలి. వూరుకోవాలి. అలాకాదని ఆ తీగను పట్టి కదిపితే డొంకంతా కదలడమే కాదు. అన్ని దీపాలూ ఆరిపోతాయి.

అపుడు మళ్ళీ వెదుక్కోవాలి ఎక్కడున్నాడోనని మన చీఫ్‌గెస్టును.

" చీఫ్‌గెస్ట్ జిందాబాద్ " అనక తప్పని రోజులు దాపురించిన ప్రజాస్వామ్య యుగమిది. సత్యహరిశ్చంద్రుని కాలం మాత్రం కాదుగదా!